





# కరపత్రం

SINCE 2014

సోమవారం అక్టోబర్ 28 2024 | సంపుటి :0 | సంచిక : 20 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## నాకు రాజకీయ అనుభవం లేకపోవచ్చు కానీ: విజయ్



◈"నాకు రాజకీయ అనుభవం లేకపోవచ్చు. కానీ, నేను పాలిటిక్స్ విషయంలో భయపడడం లేదు" అని నటుడు విజయ్ అన్నారు.

◈కెరీర్‌ని పీక్‌లో వదిలేసి రాజకీయాల్లోకి వచ్చా..

◈తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడిగా విజయ్ తమ పార్టీ భావజాలాన్ని, సిద్ధాంతాలను ప్రకటించారు.

◈"ద్రవిడ, తమిళ జాతీయవాద సిద్ధాంతాలను అనుసరిస్తాం. తమిళనాడు గడ్డకు ఇవి రెండు కళ్లులాంటివి. విమర్శలకు చెక్ పెట్టి.. పొత్తులపై క్లారిటీ..

## మన్‌కీ బాత్‌లో మోదీ



+'మన్‌కీ బాత్' కార్యక్రమం 115వ ఎపిసోడ్‌లో డిజిటల్

+మోసాలపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. వీటిపై అవగాహన ముఖ్యమన్నారు.

+'మన్‌కీ బాత్' 115వ ఎపిసోడ్‌లో ఆయన ప్రసంగించారు. దీపావళి పండగకు ముందుగానే శుభాకాంక్షలు తెలియజేశారు

+యానిమేషన్, గేమింగ్ పరిశ్రమలపై ప్రశంసల జల్లు కురిపించారు.

+యువత మన సంస్కృతికి అద్దం పట్టే ఒరిజినల్ ఇండియన్ కంటెంట్‌ను రూపొందిస్తోంది.

## మరికొద్ది రోజుల్లో బస్సు యజమానులుగా డ్వాక్రా మహిళలు: భట్టి విక్రమార్క



➪మహిళాభివృద్ధిలో దేశానికి తెలంగాణ ఆదర్శమనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

➪ఖమ్మం కలెక్టరేట్‌లోని మహిళా శక్తి క్యాంటీన్, బస్సు షెల్టర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

➪వాళ్లకు రూ.25 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

➪వాళ్లకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయిస్తాం.

➪ఆ వాహనాలను ఆర్టీసీకి అద్దెకు ఇప్పిస్తాం. మహిళల భాగస్వామ్యంతో ఖమ్మంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం.

➪వడ్డీ లేని రుణాల పంపిణీని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి" అని భట్టి విక్రమార్క తెలిపారు.

## దీపావళి కానుకగా..ఇందిరమ్మ ఇళ్లు

ఒక్కో నియోజకవర్గంలో 3,500 గృహాల నిర్మాణం

నవంబరు 30 లోగా రాష్ట్రంలో కులగణన

మెట్రో రెండో దశకు ఆమోదం

ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ

ఉద్యోగుల మెడికల్, స్పౌజ్, పరస్పర బదిలీలకు పచ్చజెండా


రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు

దీపావళి పర్వదిన కానుకగా ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

2020 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిల్లో ఒకటి ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

గత ప్రభుత్వంలో రైస్‌మిల్లర్ల దగ్గర రూ.20 వేల కోట్ల ధాన్యం మిగిలిపోయింది.

నవంబరు 30 వరకూ రాష్ట్రంలో కుల గణన సర్వే పూర్తి చేయాలి.



దీపావళి పర్వదిన కానుకగా ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీపావళి రోజు అమావాస్య కాబట్టి.. ఆ తర్వాత మంచిరోజు చూసుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ గృహాలను నిర్మించనున్నట్లు తెలిపారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా గ్రామ సభలు నిర్వహించి బహు పేదలను పారదర్శకంగా ఎంపిక చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో శనివారం దాదాపు నాలుగు గంటలకు పైగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. ఈనెల 31లోగా దీపావళి పండగకు ముందే.. తాను చెప్పిన బాంబు పేలుతుందని పొంగులేటి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భూముల కేటాయింపుపై వస్తున్న ప్రచారంపై స్పందిస్తూ..

## మూసీ పేరు చెప్పి కాంగ్రెస్ దోచుకుంటోంది: కేటీఆర్



✶భారాస నిర్మించిన ఎస్టీపీల(మురుగు నీటి శుద్ధి కేంద్రాలు) వల్ల మురుగు నీరు శుద్ధి జరుగుతోందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

✶నాచారంలోని ఎస్టీపీని ఆయన పరిశీలించి మాట్లాడారు.

✶భారాస హయాంలో హైదరాబాద్‌లో మురుగు నీటి శుద్ధికి సుమారు రూ.4 వేల కోట్లు కేటాయించామన్నారు.

✶అప్పుడు నిర్మించిన ఎస్టీపీలనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారని చెప్పారు.

✶కేసీఆర్ ఎప్పుడో మూసీ పునరుజ్జీవం పనులు మొదలుపెట్టారని చెప్పారు.

✶ఇప్పుడు మీరు వచ్చి కొత్తగా చేయాల్సింది ఏమీ లేదన్నారు.

✶"రుణమాఫీకి, రైతుబంధుకు ప్రభుత్వం వద్ద పైసలు లేవన్నారు.

✶ఏ పథకం అమలు చేయాలన్నా పైసలు లేవని మంత్రులు అంటున్నారు.


✶ మూసీ పునరుజ్జీవానికి మాత్రమే ప్రభుత్వం వద్ద పైసలు ఉన్నాయి.

## తెలంగాణ కోనేరులో కమలం వికసించేనా!

ప్రత్యేక వ్యాసం


- కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి,మేడ్చల్ నియోజక వర్గం


భారతీయ జనతా పార్టీ కి దక్షిణ భారత దేశ రాజకీయాలు ఒక పజిల్ లాంటిది.తమిళనాట ద్రవిడ వాదం,కేరళలో మతాల ఆధిపత్యం,కరాటకలో కుల కుంపటి,ఆంధ్ర అవకాశవాదం, తెలంగాణలో నైజాం వ్యతిరేక కమ్యూనిస్టు ఉద్యమ భావజాలం, తెలంగాణలో నిజాం కాలంలో పాలించిన ఇస్లాం, ఇంకోపక్క క్రైస్తవం విస్తరణ, 60వ దశకం లో నక్సలిజం వసంత మేఘ గర్జన బిజెపి ఎదుగుదలకు సవాల్ గా ఉన్నది.కాని విశ్వ హిందూ పరిషత్,విద్యార్థి ఉద్యమాలు,కార్మిక కర్షక రంగ ఉద్యమాలు, ఆర్ ఎస్ ఎస్ కృషి, వనవాసి క్షేత్రం, ప్రకృతి ఉపద్రవాల్లో సేవా కార్యక్రమాలు,పేదలకు ఉచిత వైద్య శిబిరాలు లాంటి కార్యక్రమాలతో జాతీయ వాద శక్తుల నిర్మాణం వల్ల బిజెపి కి బలమైన క్యాడర్ తయారయ్యింది.దీనితో బిజెపి మెల్ల మెల్లగా తెలంగాణలో తన అడుగుజాడలు ముద్రిస్తున్నది.తెలంగాణలో బిజెపి కి ఖచ్చితంగా కార్యకర్తల బలం పెరిగింది. కాని నియోజక వర్గాల వారిగా బిజెపి కి




ఎన్నికల్లో ఢీ అంటే ఢీ అనే నాయకుల కొరత ఉన్నది.నిరంతరం పోరాటం చేసే క్యాడర్ ఆర్థిక లోపంతో ఎన్నికల రాజకీయాల్లో నిలదొక్కుకోవడం కష్టంగా మారింది.ఈ పరిస్థితి నుండి గట్టెక్కడానికి బిజెపి కి ఇంపోర్టెడ్ నాయకుల అవసరం పడింది.కాని బిజెపి లో చేరిన ఆయా పార్టీల నాయకులు తమతో పాటు తమ వ్యక్తిగత ఎజెండా ను మోసుకొచ్చారు.ఇక్కడే బిజెపికి కొత్త నాయకులను సమన్వయం చేసే ప్రక్రియ రూపకల్పనలో సమయం పడుతున్నది.పాత కొత్త నాయకులను ఉమ్మడి కార్యాచరణ వైపు మళ్లించడం కష్టమైనా మెల్ల మెల్లగా ఈ వైపు బిజెపి తన పనిలో సఫలీకృతం అవుతున్నట్టే కనిపిస్తున్నది.వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి..ఇకపై ఉమ్మడిగా ఉద్యమించాలని నాయకులంతా డిసైడ్ అయ్యారు. పార్టీ అజెండానే ఉమ్మడిగా ప్రజల్లోకి తీసుకువెళ్తామంటున్నారు. మరి కాషాయ పార్టీలో ఈ మార్పులకు కారణం ఏంటి..?


మిగతాద్ది 3 లో


## రైతుబంధు ఇవ్వడంలేదు.. రైతుబంధు ఉందో, లేదో తెలియదు



కాంగ్రెస్ ప్రజల ఆశలు.. ఆకాంక్షలను వమ్ము చేస్తోంది

అన్ని వర్గాల ప్రజలు మోసపోయామని భావిస్తున్నారు

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదు

పెన్షన్లను రూ.4వేలకు పెంచుతామని చెప్పి.. ఇంతవరకు పెంచలేదు

యువతకు నిరుద్యోగ భృతి గురించి ఇంకా సీఎం ఆలోచించడంలేదు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



## సదర్ అంటే యాదవుల ఖదర్..

▲హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్‌ది

▲ ఉద్యోగ.. ఉపాధి అవకాశాలు కల్పించాలనేది కాంగ్రెస్ లక్ష్యం

▲ మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించాం

▲ మూసీ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

▲మూసీలో నరకాన్ని అనుభవిస్తున్న ప్రతి పేదవాడి జీవితంలో వెలుగునిద్దాం : సీఎం

# నాకు రాజకీయ అనుభవం లేకపోవచ్చు కానీ: విజయ్

**సమ సమాజానికి కృషి.. అవినీతిపై పోరాటం**
**"పుట్టుకతోనే మనుషులంతా సమానం. సమ సమాజాన్ని సృష్టించడమే పార్టీ లక్ష్యం. దీంతో పాటు సెక్యులరిజం, రాష్ట్ర స్వయంప్రతిపత్తి, సమ్మిళిత అభివృద్ధి, ద్విభాషా విధానం, అవినీతిపై పోరాటం, తిరోగమన ఆలోచనల తిరస్కరణ, డ్రగ్స్ రహిత తమిళనాడు వంటివి ప్రధాన అంశాలు"**

తమిళగ వెట్రి కళగం (టీవీకే).. మహానాడులో విజయ్ మాట్లాడారు. ఆ సభకు లక్షలమంది అభిమానులు హాజరయ్యారు.

"నాకు రాజకీయ అనుభవం లేకపోవచ్చు. కానీ, నేను పాలిటిక్స్ విషయంలో భయపడడం లేదు" అని నటుడు విజయ్ అన్నారు. సినీ రంగంతో పోలిస్తే రాజకీయ రంగం చాలా సీరియస్ అని పేర్కొన్నారు. విల్లుపురం సమీపంలో నిర్వహించిన తమిళగ వెట్రి కళగం పార్టీ మొదటి మహానాడులో ఆయన సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలతోపాటు వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ సభకు వేలాదిమంది అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు.

### కెరీర్‌ని పీక్‌లో వదిలేసి రాజకీయాల్లోకి వచ్చా..

తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడిగా విజయ్ తమ పార్టీ భావజాలాన్ని, సిద్ధాంతాలను ప్రకటించారు. "ద్రవిడ, తమిళ జాతీయవాద సిద్ధాంతాలను అనుసరిస్తాం. తమిళనాడు గడ్డకు ఇవి రెండు కళ్లులాంటివి. లౌకిక, సామాజిక న్యాయ సిద్ధాంతాలే మా భావజాలం. వాటి ఆధారంగానే పని చేస్తాం. పెరియార్ ఈవీ రామస్వామి, కె.కామరాజ్, బాబాసాహెబ్ అంబేద్కర్, వేలు నాచియార్, అంజలి అమ్మాళ్ ఆశయాలతో పార్టీని ముందుకు తీసుకెళ్తాం. రాజకీయాల్లో ఫెయిల్యూర్స్, సక్సెస్ స్టోరీలు చదివాక.. నేను నా కెరీర్‌ని పీక్‌లో వదిలేసి మీ అందరిపై అచంచలమైన విశ్వాసాన్ని ఉంచి మీ విజయ్‌గా ఇక్కడ నిలబడ్డా. రాజకీయ అనుభవం లేదంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కానీ అమితమైన ఆత్మవిశ్వాసంతో మనం సర్పం (రాజకీయం)తో ఆడుకునే పిల్లల్లాంటివాళ్లం" అన్నారు.

### విమర్శలకు చెక్ పెట్టి.. పొత్తులపై క్లారిటీ..

భాజపా నిరంకుశత్వంతో వ్యవహరిస్తుందని విమర్శించిన విజయ్.. డీఎంకే ద్రవిడియన్ నమూనాపైనా విరుచుకుపడ్డారు. తన రాజకీయ ప్రయాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్న ఆయన.. అరియలూరులో నీట్ విద్యార్థిని అనిత ఆత్మహత్య ఉదంతాన్ని గుర్తు చేస్తూ నీట్‌పై తమ పార్టీ వ్యతిరేక వైఖరిని ఈ సందర్భంగా ప్రకటించారు. తనను ఆర్టిస్ట్ అంటూ పలువురు చేస్తోన్న విమర్శలకు దీటుగా బదులిచ్చారు. 'సినిమా కెరీర్‌లో అత్యున్నత స్థాయిని వదిలేసి ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చా. నేను సినిమాల్లోకి వచ్చినప్పుడు కూడా నన్ను అవమానించారు. అయినా, కఠోర శ్రమ, ధైర్యంతో ఈ స్థాయికి చేరుకున్నా. ఎంజీఆర్, ఎన్టీఆర్ సైతం ఇదే విధమైన విమర్శలను ఎదుర్కొన్నారు. కానీ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వారు ప్రభంజనం సృష్టించారు. ప్రతి ఓటు ఎంతో శక్తిమంతమైనది.. మా పార్టీ తమిళనాడు రాజకీయాలపై బలమైన ప్రభావం చూపుతుంది" అన్నారు. పొత్తులపై మాట్లాడుతూ.. "రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మమ్మల్ని పూర్తిస్థాయి మెజార్టీతో గెలిపిస్తారని పూర్తిగా విశ్వసిస్తున్నాం. ఒకవేళ ఏవైనా పార్టీలు పొత్తు పెట్టుకోవాలనుకుంటే.. వారికి అధికారంలో భాగస్వాముల్ని చేస్తాం" అన్నారు.

### సమ సమాజానికి కృషి.. అవినీతిపై పోరాటం

సభా వేదికపై ఆ పార్టీ నేత ప్రొఫెసర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. తమిళగ వెట్రి కళగం పార్టీ సిద్ధాంతాలు, విధానాలను వివరించారు.. "పుట్టుకతోనే మనుషులంతా సమానం. సమ సమాజాన్ని సృష్టించడమే పార్టీ లక్ష్యం. దీంతో పాటు సెక్యులరిజం, రాష్ట్ర స్వయంప్రతిపత్తి, సమ్మిళిత అభివృద్ధి, ద్విభాషా విధానం, అవినీతిపై పోరాటం, తిరోగమన ఆలోచనల తిరస్కరణ, డ్రగ్స్ రహిత తమిళనాడు వంటివి ప్రధాన అంశాలు"గా పేర్కొన్నారు. అనంతరం మరో నేత కేథరిన్ మాట్లాడుతూ.. "మదురైలో సచివాలయం శాఖ ఏర్పాటు, కుల గణన , విద్యను రాష్ట్ర జాబితాలోకి మార్చేందుకు ఒత్తిడి చేయడం, గవర్నర్ పదవి రద్దుకు ప్రతిపాదన, మూడింట ఒక వంతు స్థానాలు మహిళలకు కేటాయించడం" వంటివి తమ లక్ష్యాలుగా పేర్కొన్నారు.

# రైతుబంధు ఇవ్వడంలేదు..

## రైతుబంధు ఉందో, లేదో తెలియదు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతోంది పూర్తిగా పాలన గాడి తప్పింది ఆర్థిక వ్యవస్థ గందరగోళంగా ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇవాళ బీజేపీ రాష్ట్ర కార్యాలయం లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర లక్ష్య సాధన అంశాలు కాంగ్రెస్ తోనే సాధ్యమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి అనేక ప్రగల్భాలు పలికి గద్దేనెక్కి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణ ప్రజల ఆకాంక్షలను వమ్ము చేసారని, 10నెలల కాంగ్రెస్ 10ఏళ్ల బీఆరెస్ పాలన దొందు దొందే రెండు పార్టీల పాలన ఒక్కటే అని ఆయన అన్నారు. గురుకుల పాఠశాలలకు రెంట్? ఇవ్వలేని పరిస్థితుల్లో కాంగ్రెస్? ఉంది. నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్లుగా కాంగ్రెస్? పరిస్థితి ఉందన్నారు. రూ. 5, రూ. 10 లక్షల కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించలేని, వీధి లైట్లు సరిచేసే కార్మికులకు జీతాలు ఇవ్వలేని, కొత్త వీధిలైట్లను నిధులివ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్? ప్రభుత్వం ఉందన్నారు. రూ. 2500 మహిళలకు హామీ రాలేదని, పెళ్లి చేసుకుంటే తులం బంగారం ఇవ్వలేదన్నారు కిషన్ రెడ్డి. కాలేజీ విద్యార్థులకు స్కూటీలు సంస్థలకు ఆర్డర్? ఇవ్వలేదని, వితంతు, విద్యార్థులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల పెన్షన్? పెంచలేదని ఆయన మండిపడ్డారు. విద్యార్థులకు ఇస్తున్న రూ. 5 లక్షల భరోసా కార్డు, యువతకు నిరుద్యోగ భృతి సీఎం ఆలోచన చేయలేదన్నారు.అంతేకాకుండా..'రైతు బంధు రాబంధుల పాలైంది. కౌలు రైతులకు ఇస్తామన్న రూ. 15వేలు కౌలుకే ఇచ్చారని విమర్శించారు. విద్యార్థుల మెస్? చార్జీల పెంపుపై అతీగతీ లేదు. దళితబంధు ఉన్నదా? ఊడిందా? తెలీదు.. బీసీ బంధు ఎవ్వరూ ఎత్తుకెళ్లారో తెలియదు. ఏ ఒక్క హామీ కూడా ఈ ప్రభుత్వం అమలు చేసే పరిస్థితి లేదు. ఇవన్నీ వదిలేసి మూసీ ప్రక్షాళనకు లక్షా యాభై వేట్ల కోట్లని ఎగిరెగిరి పడుతున్నారని విమర్శించారు. ముందుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏంటో చెప్పాలన్నారు. బీఆర్?ఎస్? హయాంలో చేసిన అప్పులు.. ఈ పది నెలల్లో అస్సలు ఎంత? వడ్డీ ఎంత చెల్లించారో చెప్పాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్? ప్రభుత్వం వచ్చాక నూతన అప్పులెంత? బీఆర్?ఎస్? సంక్షేమ కార్యక్రమాలు ఉన్నాయా? ఊడబీకారా? ఎన్ని పథకాలున్నాయి? ఎన్ని రద్దు చేశారు? కాంగ్రెస్? హయాంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల పరిస్థితి ఏంటీ? వీటికి ఎంత ఖర్చు అవుతుంది? మిగతా ప్రభుత్వ ఖర్చులెంత, అభివృద్ధి పనులకెంత, రోడ్లు, పాఠశాలలు, హాస్టల్?స్? నిర్మాణం, వంటివిషయాలు ఎలా అమలు చేస్తారు? దళితులు, మైనార్టీలు, యువత, రైతాంగంపై ప్రవేశపెట్టిన ప్రత్యేక కార్యక్రమాల నివేదిక ఏంటని నిలదీశారు?ఏ రకంగా ఆర్థిక వనరులు సమకూర్చుకుంటారు? ఏయే భూములు అమ్మాలనుకుంటున్నారు? మూసీలో భూములు ఎంతమేర అమ్ముతారు? లేదా ఆక్రమించుకుంటారా? ప్రభుత్వం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గందరగోళంలో ఉందన్నారు. గతంలో బీఆర్?ఎస్? ఆర్థిక పరిస్థితి భ్రష్టు పట్టించిందన్నారు. కాళేశ్వరం పేరుతో దోపిడీ చేస్తే కాంగ్రెస్? సీఎం రేవంత్? రెడ్డి పది నెలల కాలంలో రియల్? ఎస్టేట్? కుప్పకూలిందన్నారు. రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయన్నారు. ఫ్లాట్లు, ప్లాట్లు కొనే పరిస్థితి లేదన్నారు. పరిశ్రమల స్థాపన ఆగిపోయిందన్నారు. 10 నెలల్లో జరిగిన ఒప్పందాలు, అప్పులపైన, ప్రభుత్వ స్థిరాస్తులపైన, రాష్?ర్ట ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ డిమాండ్? చేస్తున్నామని కేంద్రమంత్రి జి.కిషన్? రెడ్డి అన్నారు. ప్రజలకు ఈ విషయాలన్నీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. దున్నపోతు ఈనిందంటే తాడు తెమ్మాన్నాడంటా? ఆలు లేదు చూలు లేదు నల్గొండకు నీరు వచ్చినట్లు అక్కడి రైతులను రెచ్చగొట్టారన్నారు. మూసీ సుందరీకరణకు బీజేపీ వ్యతిరేకం కాదు. అన్ని రకాలుగా సాకారం అందిస్తామన్నారు. మూసీకి రిటైనింగ్? వాల్? కట్టి కృష్ణా, గోదావరి, అనంతగిరిలో పుట్టించి నీరు తీసుకువస్తారా? అని ప్రశ్నించారు. ఈ పనికి ప్రతీఒక్కరూ స్వాగతం పలుకుతారని అన్నారు.

# స్కామ్‌లపై అవగాహన అవసరం..మన్‌కీ బాత్‌లో మోదీ

'మన్‌కీ బాత్' కార్యక్రమం 115వ ఎపిసోడ్‌లో డిజిటల్ మోసాలపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. వీటిపై అవగాహన ముఖ్యమన్నారు. డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ స్కామ్‌లపై ప్రజలకు అవగాహన అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. 'మన్‌కీ బాత్' 115వ ఎపిసోడ్‌లో ఆయన ప్రసంగించారు. దీపావళి పండగకు ముందుగానే శుభాకాంక్షలు తెలియజేశారు. యానిమేషన్, గేమింగ్ పరిశ్రమలపై ప్రశంసల జల్లు కురిపించారు. ఆత్మనిర్భర్‌తో భారత్ ప్రతి రంగంలోనూ అద్భుతాలు సృష్టిస్తోందని మోదీ తెలిపారు. 'స్వయం సమృద్ధి అనేది కేవలం విధానం మాత్రమే కాదు. అది మన అభిరుచి. కొన్నేళ్ల క్రితం భారత్‌లో ఏదైనా క్లిష్టమైన సాంకేతికత అభివృద్ధి చెందుతుందని చెబితే ఎవరూ నమ్మేవారు కాదు. అపహాస్యం చేసేవారు. కానీ, ఇప్పుడు ప్రతి రంగంలోనూ అద్భుతాలను చూసి ఆశ్చర్యపోతున్నారు. యువత మన సంస్కృతికి అద్దం పట్టే ఒరిజినల్ ఇండియన్ కంటెంట్‌ను రూపొందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వీటిని వీక్షిస్తున్నారు. యానిమేషన్ రంగం నేడు ఇతర పరిశ్రమలకు బలం చేకూర్చేదిగా రూపుదిద్దుకుంది. వర్చువల్ రియాలిటీ టూరిజం నేడు ప్రసిద్ధి చెందుతోంది. అక్టోబర్ 28న 'వరల్డ్ యానిమేషన్ డే' జరుపుకోనున్నాం. భారత్‌ను గ్లోబల్ యానిమేషన్ పవర్‌హౌస్‌గా మార్చేందుకు సంకల్పించాలి' అని మోదీ పిలుపునిచ్చారు.డిజిటల్ మోసాలపై ఆందోళన వద్దని మోదీ ప్రజలకు సూచించారు. ఇలాంటి సందర్భం ఎదురైతే కాసేపు ఆగి, ఆలోచించి ఆ తర్వాత చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు దర్యాప్తు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పనిచేస్తున్నాయన్నారు. డిజిటల్ మోసాలకు సంబంధించిన వీడియోను ప్లే చేసిన ఆయన.. ఏ దర్యాప్తు సంస్థలు ఫోన్లు, వీడియో కాల్స్ ద్వారా మిమ్మల్ని సంప్రదించవన్నారు. నేరగాళ్ల నుంచి కాల్స్ వస్తే 1930 నంబర్ లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ సాయంతో ఫిర్యాదు చేయాలన్నారు.

# దీపావళి కానుకగా.. ఇందిరమ్మ ఇళ్లు

దీపావళి పర్వదిన కానుకగా ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీపావళి పర్వదిన కానుకగా ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీపావళి రోజు అమావాస్య కాబట్టి.. ఆ తర్వాత మంచిరోజు చూసుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ గృహాలను నిర్మించనున్నట్లు తెలిపారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా గ్రామ సభలు నిర్వహించి బహు పేదలను పారదర్శకంగా ఎంపిక చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో శనివారం దాదాపు నాలుగు గంటలకు పైగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. ఆ వివరాలను మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 31లోగా దీపావళి పండగకు ముందే.. తాను చెప్పిన బాంబు పేలుతుందని పొంగులేటి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భూముల కేటాయింపుపై వస్తున్న ప్రచారంపై స్పందిస్తూ.. ఎవరికీ ఏ రకమైన భూములూ కేటాయించడం లేదని మంత్రి స్పష్టం చేశారు. మంత్రులు తెలియజేసిన వివరాలివీ...2020 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిల్లో ఒకటి ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాలు సంతోషంగా స్వీకరించాలి. ఆర్థిక పరిస్థితి కుదుటపడగానే అన్నీ క్లియర్ చేస్తాం.317 జీవో, 46 జీవోలపై సబ్ కమిటీ ఇచ్చిన నివేదికపై క్యాబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులకు సంబంధించిన మెడికల్, స్పౌజ్, మ్యూచువల్ బదిలీలకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. స్థానికత అంశం రాష్ట్రపతి పరిధిలో ఉన్నందున న్యాయసలహా తీసుకొని అసెంబ్లీలో చర్చించి ముందుకు వెళ్లాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. నవంబరు 30 వరకూ రాష్ట్రంలో కుల గణన సర్వే పూర్తి చేయాలి. నవంబరు 4 నుంచి 19 వరకూ రాష్ట్రమంతటా ఇంటింటి సర్వే చేపట్టాలి. దాదాపు 80వేల ఎన్యూమరేటర్లను సర్వే విధులకు డిప్యూట్ చేస్తారు. వారికి త్వరలో శిక్షణ ఇస్తారు. సోమవారం నుంచి జిల్లా కలెక్టర్ల సమావేశంతో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక్కో ఎన్యూమరేటర్ నిర్ణీత గడువు లోగా 150 ఇళ్ల నుంచి వివరాలు సేకరిస్తారు. దీనికి సంబంధించిన విధి విధానాలను, ప్రశ్నావళిని క్యాబినెట్ ఆమోదించింది. సమగ్ర సమాచారాన్ని సేకరించబోతున్నాం. ఆ వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతాం. అందరూ స్పందించాలి. ఈ ప్రక్రియకు సంబంధిత సంఘాలన్నీ సహకరించాలి.ధాన్యం సేకరణకు సుమారు 6వేలకు పైగా కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఇప్పటికే కొన్ని ఏర్పాటయ్యాయి. మరికొన్నింటిని త్వరలో ఏర్పాటు చేయబోతున్నాం.గత ప్రభుత్వంలో రైస్‌మిల్లర్ల దగ్గర రూ.20 వేల కోట్ల ధాన్యం మిగిలిపోయింది. దీనిపై క్యాబినెట్ విస్తృతంగా చర్చించింది. ఇతర రాష్ట్రాల్లో దీనిపై ఏవిధమైన నిర్ణయాలు తీసుకున్నారో పరిశీలించిన తర్వాత.. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రానికి మంచి జరిగేలా నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇప్పటికే డిఫాల్టర్లుగా ఉన్నవారిని మొత్తంగా తొలగించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లకు ధాన్యాన్ని కేటాయించేటప్పుడు వారి స్థాయిలను బట్టి బ్యాంక్ గ్యారెంటీలు తీసుకొంటుంది.హైదరాబాద్‌లో మెట్రో రైలు రెండో దశ విస్తరణకు సంబంధించిన డీపీఆర్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నాగోల్‌- శంషాబాద్, రాయదుర్గం-కోకాపేట్, ఎంజీబీఎస్‌- చాంద్రాయణగుట్ట, మియాపూర్‌-పటాన్‌చెరు, ఎల్‌బీనగర్‌-హయత్‌నగర్.. మొత్తం 76.4 కి.మీ. విస్తరణ చేపట్టాలని నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ ప్రాజెక్టు చేపట్టాలని తీర్మానించింది. మొత్తం రూ.24,269 కోట్లతో ఈ ప్రతిపాదనలను రూపొందించారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపిస్తారు. రాష్ట్రంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల్లో 16-17 వేల కి.మీ. రహదారులను నిర్మాణం చేయాల్సి ఉంది. వీటి అభివృద్ధికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకొంది. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు.. మండల కేంద్రం నుంచి జిల్లాలకు డబుల్ రోడ్డు.. జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు ఫోర్ లేన్ రోడ్డు ఉండేలా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. అందుకు అనుగుణంగా ఇప్పుడు ఉన్న రోడ్లను అభివృద్ధి చేయడం.. కొత్త రోడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించడం వంటి ప్రక్రియలను మొదలుపెట్టాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న రోడ్ల నిర్మాణానికి దాదాపు రూ.25వేల నుంచి రూ.28వేల కోట్లు అవసరమని అంచనా వేసింది. సమగ్ర అంచనాలతో పాటు.. ఏ విధానంలో రోడ్ల నిర్మాణం చేపట్టాలనే నివేదికలను తయారుచేయాలని మంత్రివర్గం అధికారులను ఆదేశించింది. వీటిని పీపీపీ మోడ్‌లో ప్రతి పాత జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకొని.. రాబోయే నాలుగు సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని కార్యాచరణ సిద్ధం చేస్తారు. అన్ని శాఖల ఇంజినీరింగ్ ముఖ్యఅధికారులతో కమిటీ ఏర్పాటు చేసి.. వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను పరిశీలించి, ఇక్కడ అమలు చేస్తారు. ఈ డీపీఆర్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవన నిర్మాణానికి గోషామహల్‌లో స్థలం కేటాయించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న స్థలాన్ని వైద్య ఆరోగ్యశాఖకు బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపింది.ములుగులో గిరిజన విశ్వవిద్యాలయానికి 211 ఎకరాల కేటాయింపునకు, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గచ్చిబౌలి స్టేడియాన్ని ఈ యూనివర్సిటీకి వినియోగించాలని నిర్ణయం తీసుకుంది.

స్కిల్స్ యూనివర్సిటీకి అనుబంధంగా మధిర, వికారాబాద్, హుజూర్‌నగర్ ఐటీఐలను కొత్తగా మంజూరు చేసింది.కొత్త కోర్టులకు, రెండు కాలేజీలకు అవసరమైన సిబ్బంది మంజూరుకు ఆమోదం తెలిపింది.రిజర్వాయర్లలో పూడిక పేరుకుపోయిన కారణంగా.. నీటి నిల్వ స్థాయి తగ్గిపోతోంది. పైలట్ ప్రాజెక్టు కింద.. కడెం ప్రాజెక్టులో పూడిక తొలగించాలని క్యాబినెట్ ఆమోదం తెలిపింది. భవిష్యత్‌లో మీడియం, మేజర్ ప్రాజెక్టుల్లోనూ ఈ ప్రక్రియను చేపడతారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు కొత్తగా 142 పోస్టులను మంజూరు చేస్తూ మంత్రివర్గం ఆమోదించినట్లుగా తెలిసింది.అధికారులను పంపించి.. అధికారులను పంపించిన తర్వాత మంత్రివర్గం మరికొంత సమయం చర్చించినట్లు తెలిసింది.

# సదర్ అంటే యాదవుల ఖదర్..



హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సదర్ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవ సోదరుల పాత్ర కాదనలేనిదని, నగరంలో సదర్ ఉత్సవాలు నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు సీఎం రేవంత్ రెడ్డి. సదర్ సమ్మేళనం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని నేను ఆనాడే చెప్పా అని, ఇక నుంచి ప్రతీ ఏటా సదర్ సమ్మేళనం అధికారికంగా నిర్వహించాలని.. ఈ వేదిక నుంచి అధికారులకు ఆదేశాలు ఇస్తున్నా అన్నారు రేవంత్ రెడ్డి. సదర్ అంటే యాదవుల ఖదర్ అని, సదర్ సమ్మేళనాన్ని ప్రతీ గ్రామానికి తీసుకెళ్లాలన్నారు. యాదవులు రాకీయంగా ఎదగాలని అనిల్ కుమార్ యాదవ్ ను రాజ్యసభకు పంపించామని, రాబోయే రోజుల్లో రాజకీయాల్లో యాదవ సోదరులకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. హైదరాబాద్ నగరంలో యాదవ సోదరులు పశు సంపదను పెంచి పోషించారని, ఆనాడు మూసీ పరివాహక ప్రాంతాల్లో యాదవ సోదరులు పశుగ్రాసాన్ని పెంచుకునేవారని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.అంతేకాకుండా..'మురికి కూపంగా మారిన మూసీకి పునరుజ్జీవం కల్పిద్దాం.. ఈ నగరం అభివృద్ధి చేయడానికి యాదవ సోదరులు అండగా నిలబడండి.. ఏ శక్తులు అడ్డొచ్చినా నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత కాంగ్రెస్ ది. మూసీ పరివాహక ప్రాంతవాసుల జీవన ప్రమాణాలను మెరుగు పరచబోతున్నాం. యాదవ సోదరులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి.. ఆనాడు ముషీరాబాద్ లో అంజన్ అన్నను గెలిపించి ఉంటే.. మీవైపు నుంచి మంత్రిగా నిలబడేవారు. అంజన్ అన్న ఓడినా యాదవ సోదరులకు ప్రాధాన్యత ఉండాలని అనిల్ కు రాజ్యసభ ఇచ్చాం.. శ్రీకృష్ణుడు కూడా ధర్మం వైపు నిలబడ్డాడు.. అందుకే కురుక్షేత్రంలో అధర్మం ఓడింది.. ధర్మం గెలిచింది.. యాదవ సోదరులారా ధర్మం వైపు నిలబడండి.. అధర్మాన్ని ఓడిద్దాం..' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
సోమవారం అక్టోబర్ 28 2024

## 10 కోట్లు దాటిన బిజెపి సభ్యత్వం

- ప్రపంచ దేశాలకు భారత్ దిక్సూచి
- కేవలం నరేంద్ర మోడీ కే సాధ్యం
- మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 27**





బిజెపి ఆన్లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట మండలం అంకుషాపూర్ గ్రామంలోని 211 పోలింగ్ బూతులలో ప్రతి ఇంటికి పోతూ సభ్యత్వం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలలలో మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారతదేశం నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ముందు ఉందని అదేవిధంగా జమ్మికుంట మండలంలో విషయంలో కార్యకర్తలు ఉత్సవంతో పనిచేస్తున్నారని వారన్నారు ఈ కార్యక్రమంలో సభ్యత మండల ఇంచార్జ్ ఆకుల రాజేందర్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పుప్పాల రఘు, జిల్లా కార్యదర్శి చిన్న మాది నరసింహారావు, పుల్లూరు ఈశ్వర్, వాసుదేవ రెడ్డి, కైలాసకోటి గణేష్, భీమిలి కిషన్ రావు, కావిటీ కుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు

## చల్లూరు లో 85వ బూత్ లో మాన్ కి బాత్ కార్యక్రమం..

- ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, అక్టోబర్ 27.**





వీణవంక మండలం చల్లూరు గ్రామంలో 85వ బూత్ లో ఆదివారం జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రివర్యులు నేరెళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు. మాన్ కీ బాత్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులుకు, బిజెపి నాయకులు పూల గుచ్చాలు అందజేస్తూ, సాదర స్వాగతం పలుకుతూ,శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామిడి ఆదిరెడ్డి , రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ పుప్పాల రఘు , జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు , సభ్యత్వ నమోదు జిల్లా కో కన్వీనర్ చెన్నమాధవునీ నరసింహారావు , మండల నాయకులు పెద్ది మల్లారెడ్డి ,ముత్యాల రవి బూత్ అధ్యక్షులు బుర్ర సదానందం , బొంగోని అజయ్, గుడెపు శివ,బోదాసు రాజయ్య , రవి,శంకర్ నవీన్ ,హరీష్, గోపి, మనీ, అరుణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ కారులను, ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.



- వీణవంక మండల అధ్యక్షులు పేరుమాండ్ల సంపత్...

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, అక్టోబర్ 27.**
ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను,రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, వీణవంక తెలంగాణ ఉద్యమ కారులు ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్నికల సమయంలో మాకు ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ.. తెలంగాణ ఉద్యమకారులకి 250 గజాల స్థలం, పెన్షన్ లను వెంటనే అమలు చేయాలని,వచ్చే శాసన సభ సమావేశాల్లో ప్రత్యేక బడ్జెట్ కేటాయించి తమను ఆదుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు తాము చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ఉద్యమకారులను గుర్తించాలన్నారు. ఉద్యమ కారుల మండల పోరం అధ్యక్షుడు పేరుమాండ్ల సంపత్,కండె మహేందర్,సంఘి గట్టయ్య ,చింతల రాజిరెడ్డి, కుమార్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణ కోనేరులో కమలం వికసించేనా!

మొదటిపేజీ తరువాయి

### కమలంలో అంతా సెట్ రైట్ అయినట్టేనా..?

తెలంగాణ బీజేపీలో అంతా సెట్ రైట్ అయినట్టే కనిపిస్తోంది. ఇంతవరకూ ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉన్ననేతలు..
ఒక్కతాటిపైకి వచ్చారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంఛార్జ్ సునీల్‌బన్సాల్ పర్యటన, నేతలతో కీలక సమావేశాల నేపథ్యంలో కాషాయ నేతలంతా ఏకమయ్యారు. దీంతో కమలం పార్టీలో సరికొత్త జోష్ కనిపిస్తోంది. ఇదే జోష్‌లో మూసీ అంశంలో ప్రభుత్వంపై పోరాటానికి కార్యాచరణ ప్రకటించింది. తెలంగాణ బీజేపీ ఈ నెల 23, 24 తేదీల్లో మూసీ ప్రాంతంలో బీజేపీ నేతలు పర్యటించారు.
మూసీ బాధితుల కోసం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఈ 25న ఇందిరాపార్క్ దగ్గర ధర్నా కూడా చేపట్టింది తెలంగాణ బీజేపీ.

మరోవైపు గవర్నర్ జిష?దేవ్ వర్మను కలిసిన బీజేపీ నేతల బ ృందం, ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ధ్వంసం, హిందూ సంఘాలపై కేసుల నమోదుపై ఫిర్యాదు చేసింది. పోలీసుల లాఠీచార్జ్‌లో గాయపడ్డ వారి వివరాలను గవర్నర్‌కు అందజేశారు బీజేపీ ప్రతినిధులు. రాష్ట్రంలో ఆలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని గవర్నర్‌ను కోరారు. అటు ఇదే అంశంపై డీజీపీ జితేందర్‌ను కూడా కలిసి ఫిర్యాదు చేశారు బీజేపీ నేతలు.

### పార్టీలో యాక్టివిటీ లేదంటూ బిజెపి శ్రేణుల్లో నిరుత్సాహం

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది ఎమ్మెల్యే, ఎనిమిది ఎంపీ సీట్లను గెల్చుకున్న కమలం పార్టీ గతంతో పోలిస్తే రాష్ట్రంలో ప్రాతినిధ్యం పెంచుకుంది. అయినా ఆ స్థాయిలో పార్టీ ఎలాంటి యాక్టివిటీ చేపట్టలేదనే నిరుత్సాహం బీజేపీ శ్రేణుల్లో ఉంది. పార్టీ సభ్యత్వ కూడా ఆశించిన స్థాయిలో జరగడం లేదన్న వాదన వినిపిస్తోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హైడ్రా, మూసీ పునరుజ్జీవం కార్యక్రమాలపై పార్టీ విధాన నిర?యం తెలియక ఎమ్మెల్యేలు, ఎంపీలు తలో మాట మాట్లాడుతున్నారు. ఈ భిన్నవాదనలతో క్యాడర్‌లో కూడా అయోమయ పరిస్థితి నెలకొంది.

### పార్టీ అజెండానే ఇకపై నేతల అజెండా

పార్టీ సీనియర్ నేత, ఎంపీ ఈటల రాజేందర్ పార్టీ పేరుతో కాకుండా సొంతంగా ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. హైడ్రా, మూసీ బాధితుల విషయంలో ఆయన సొంతంగానే వెళ్లారు. అదే సమయంలో ప్రభుత్వం తెచ్చిన హైడ్రాను ఈటల రాజేందర్ వ్యతిరేకిస్తుంటే..మెదక్ ఎంపీ రఘునందనరావు, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి సమర్థించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ గ్రూప్-1 వ్యవహారం, ముత్యాలమ్మ గుడి వివాదంపై ప్రభుత్వంపై పోరాటం చేపట్టారు.
నిజామాబాద్ ఎం.పీ గా గెలిచిన అరవింద్ పాత కార్యకర్తలను నిర్లక్ష్యం చేస్తున్నాడని,తన గెలుపుకు ప్రధాని నరేంద్ర మోడీ చరిష్మా చాలు అని అనుకుంటున్నాడని పాత క్యాడర్ బహిరంగంగా అంటున్నారు.
కొత్త నాయకులు తమ స్వంత మనుషులతో పార్టీని నింపి,తమ స్వంత ఎజెండాతో పనిచేసే ఇంపోర్టెడ్ నాయకుల వల్ల సైద్ధాంతిక అంకిత భావం గల కార్యకర్తలు నిర్లిప్తంగా మారుతున్నారు.
ఆర్మూర్, కామారెడ్డి నిర్మల్ లాంటి చోట్ల గెలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులు కేవలం మోడీ జపంతో పార్టీని శాసిస్తున్నారు. ఎదురు దెబ్బలు తింటూ జీవితాంతం ఆదర్శం లక్ష్యం కొరకు పనిచేసిన కార్యకర్తలు ఈ అధికార రాజకీయ క్రీడలో వెనకబడి పోతున్నారు.
ఇలా కొత్త నేతలు పార్టీ తరఫున స్టాండ్ తీసుకోకుండా వేర్వేరు అజెండాలతో ముందుకు వెళ్తుండడం.. క్యాడర్‌లో గందరగోళానికి కారణమవుతుంది. పార్టీ నేతల తీరు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉందన్న చర్చ కూడా సాగుతోంది. దీంతో ఈ పరిస్థితి అడ్డుకట్ట వేయాలని డిసైడ్ అయింది బిజెపి పార్టీ. ఇకపై ఒక్కో నేత ఒక్కో అజెండాతో ముందుకు వెళ్లకుండా, పార్టీ అజెండానే ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని అధిషా'నం స్పష్టం చేసింది. మరి బన్సల్ గీతోపదేశంతో పార్టీలో ఇంకా ఎలాంటి మార్పులు జరుగుతాయో చూడాలి

## వీణవంక మేదర సంఘానికి 25 వేల ఆర్థిక సహాయం..

- యుఫ్ టీవీ సీఈవో పాడి ఉదయ నందన్ రెడ్డి..

**కరపత్రం ప్రతినిధి,వీణవంక, అక్టోబర్ 27.**
వీణవంక మండల కేంద్రానికి చెందిన మధిర వెంకటేష్, వీణవంక మేదర సంఘం అధ్యక్షులు కుచనపెల్లి రాజు, కుల పెద్దల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మేదర సంఘ ఆధ్వర్యంలో మేదర కులస్తులు నిర్వహించుకునే వినాయకుని నవరాత్రుల ఉత్సవాలు, దేవి నవరాత్రులు అలాగే ఆడపడుచులు ఆడుకునే బతుకమ్మ పండుగలకు తమకు సౌండ్ బాక్స్ లకి ఆర్థిక సహాయం కావాలని, యుఫ్ టీవీ సీఈఓ పాడి ఉదయ నందన్ రెడ్డి ని మేదర కులస్తులు కోరగా, వారు తక్షణమే స్పందించి వారి అనుచరులచే 20,000 ఇరువై వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మేదర కులస్తులకు అందజేశారు. మేదర కుల సంఘం జిల్లా కార్యదర్శి కుచనపెల్లి గణేష్ మాట్లాడుతూ... గతంలో మా పంట పొలాలల్లో వెలసిన శ్రీ నరసింహస్వామి గుడి నిర్మాణానికి గతంలో పాడి ఉదయ నందన్ రెడ్డి 5,000 ఐదువేల రూపాయలను విరాళంగా అందజేశారని, మేదర కులస్తులకు సంబంధించిన ప్రతి కార్యక్రమంలో మాకు చేదోడు వాదోడుగా అండగా నిలుస్తున్నారన్నారు. యుఫ్ టీవీ సీఈవో పాడి ఉదయ నందన్ రెడ్డి మేదర కులస్తులు ప్రత్యేకధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలోవీణవంక మాజీ జడ్పీటీసీ దసారపు ప్రభాకర్, వెన్నంపల్లి నారాయణ,



వీణవంక మేదర సంఘం అధ్యక్షులు కూచిన పెల్లి రాజు, అమృత ప్రభాకర్, సమిండ్ల ప్రకాష్, కూచిన పెల్లి గణేష్, కుమారస్వామి, సాంబయ్య, రాజమౌళి, సారయ్య,మల్లయ్య,రాములు, శనిగరపు రమేష్, మల్లయ్య,దసారపు లోకేష్,అశోక్,వంశీ, సంతోష్, తాళ్లపల్లి కుమారస్వామి, తొట్ల రాకేష్, చందు, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా పోరాడాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట అక్టోబర్ 27**
పేదప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై, అన్యాయాలు అక్రమాలపై, దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రోజున ఇల్లందకుంట మండల కేంద్రంలో ప్రజాసంఘాల సమన్వయ కమిటీ సమావేశం చెల్పూరి రాములు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై వాసుదేవరెడ్డి మాట్లాడుతూ పేదల పక్షాన దేశవ్యాప్తంగా నికరంగా పోరాడుతున్నది ఎర్రజెండానే అన్నారు. కార్మికులు కర్షకులు వృత్తిదారులు విద్యార్థి యువజనులు మహిళలు మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనునిత్యం వివిధ రూపాల్లో ఆందోళనలో పోరాటాలు చేస్తున్నామన్నారు. ప్రజా పోరాటాల ముందు నిర్బంధ చట్టాలు నడవవన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశభక్తి ముసుగులో నేషనల్ మానిటేషన్ పైప్ లైన్ పేరుతో ఆరు లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు దారా దత్తం





చేసిందన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బిజెపి పాలనలో మహిళలపై పిల్లలపై అత్యాచారాలు లైంగిక వేధింపులు హింస కొనసాగుతూనే ఉందన్నారు. డేటా రెండు లక్షల కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు మోడీ ప్రభుత్వ హామీ నీటి మూటలే అయిందన్నారు. మత రాజకీయాలను ప్రోత్సహిస్తూ పబ్బం గ దుపుక్కుంటుందన్నారు. మతోన్మాదం దేశ ప్రగతికి విగాథం కలిగిస్తుందన్నారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి తీవ్ర విగాథం కలిగిస్తాయన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలలు అయిపోయినప్పటికీ పథకాలు అమలుకు నోచుకోలేదన్నారు. ఒక్క ఫ్రీ బస్సు మీనాయిస్తే ఏ ఒక్క పథకం కూడా పూర్తిగా అమలు కాలేదు అన్నారు. రాబోయే కాలంలో ప్రజలను సమీకరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు కొనసాగించాలని వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, నాయకులు తిప్పర బోయిన శ్రీకాంత్, సంతోష్, కొత్తూరిమల్లయ్య, రాజేందర్, ఆరెల్లి ఓదెల్, గందసిరి సంపత్, మల్లేష్, విక్రమ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమే

- మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 27**
రానున్న రోజుల్లో తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని మాజీ మంత్రి, బిజెపి రాష్ట్ర నాయకులు నేరెళ్ల ఆంజనేయులు అన్నారు జమ్మికుంట పట్టణంలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ అనేక రకాల హామీలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఆంజనేయులు మండిపడ్డారు. అనతికాలంలోనే ప్రజల చేత చీత్కరించుకున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని మాజీ మంత్రి ఆంజనేయులు చురకంటించారు. గతంలో పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన



బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, అదోగతి పాలు చేసిందని, మాజీ మంత్రి దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి భవిష్యత్ లేదని జోస్యం చెప్పారు. తెలంగాణలో బిజెపికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని దానికి అనుగుణంగా బిజెపి కార్యకర్తలు పనిచేసి పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేపించాలని బీజేపీ కార్యకర్తలకు సూచించారు. జమ్మికుంట పట్టణంలో పెద్ద ఎత్తున బీజేపీ సభ్యత్వం చేపించిన పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్,మరియు పట్టణ కమిటీని ఆంజనేయులు అభినందించారు. మాజీ మంత్రి వెంట, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, జిల్లా కార్యదర్శి చెన్నమాధవుని నరసింహ రాజు,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు,పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, పల్లపు రవి ఠాగూర్ రాజేష్ అప్పం మధు యాదవ్ మోడం రాజు బూరుగుపల్లి రామ్ అప్పల రవీందర్ కొండపర్తి ప్రవీణ్ తదితరు పాల్గొన్నారు



# నా తల్లిదండ్రుల ఎదుటే

## ఆ నిర్మాత అవమానించాడు

కెరీర్ ఆరంభంలో తాను ఎన్నో సవాళ్లు, రిజెక్షన్స్ ఎదుర్కొన్నానని బాలీవుడ్ నటి విద్యాబాలన్ తెలిపారు. దక్షిణాదికి చెందిన ఒక నిర్మాత తనని అవమానించాడని అన్నారు. ఆయన మాటలకు దాదాపు ఆరు నెలలు అద్దంలో చూసుకోలేకపోయానని తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు."చక్రం' అనే మలయాళ చిత్రంతో నటిగా ఎంట్రీ ఇచ్చా. మోహన్‌లాల్ హీరో. కెరీర్ ఆరంభంలోనే స్టార్‌హీరోతో సినిమా చేస్తున్నానని తెలిసి చాలా అవకాశాలు నన్ను వరించాయి. అనివార్య కారణాల వల్ల షూటింగ్ దశలోనే 'చక్రం' ఆగిపోయింది. దాంతో మిగిలిన సినిమాల్లో నన్ను తొలగించి వేరే హీరోయిన్స్‌ను పెట్టుకున్నారు. మూడేళ్లపాటు బాధపడ్డా. ఏం జరుగుతుందో అర్థం కాక.. కుంగుబాటుకు లోనయ్యా. ఇంట్లో ప్రతిరోజూ గొడవలు జరుగుతుండేవి. నీ తోటి వాళ్లందరూ సెటిలయ్యారు నువ్వెందుకు ఇక్కడే ఆగిపోయావు. సినిమాలు మనకు సెట్ కావని అమ్మ చెబుతుండేది""కొంతకాలానికి ఒక తమిళ చిత్రంలో అవకాశం వచ్చింది. కొన్నిరోజులు షూట్ చేశా. 'చక్రం' ఆగిపోయిందని తమిళ నిర్మాతకు తెలిసింది. దాంతో ఆయన నా జాతకం చూపించాడు. తమ చిత్రానికి సెట్ కానని తొలగించాడు. విషయం తెలిసి.. నా తల్లిదండ్రులతో ఆయన్ని కలిశా. సినిమా కోసం షూట్ చేసిన కొన్ని సన్నివేశాలు చూపిస్తూ.. 'ఒక్కసారి ఆమె ముఖం చూడండి హీరోయిన్‌లా ఎక్కడైనా కనిపిస్తుందా? డ్యాన్స్ రాదు. యాక్టింగ్ రాదు' అని అవమానించాడు. దాదాపు ఆరు నెలలు అద్దంలో చూసుకోలేకపోయా. నాపై నాకే అసహ్యం వేసింది" అని విద్యాబాలన్ చెప్పారు. ఆత్మవిశ్వాసం కోల్పోయిన సమయంలో ప్రదీప్ సర్కార్ తనకు ఎంతో అండగా నిలిచారని.. యాడ్‌షూట్స్, సినిమాల్లో అవకాశం ఇచ్చారన్నారు.

# మజాకా నాయిక



సంక్రాంతి బరిలో 'మజాకా'తో వినోదాలు పంచనున్నారు సందీప్ కిషన్. ఆయన హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని త్రినాథరావు నక్కిన తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. ఇందులో సందీప్‌కు జోడీగా రీతూ వర్మ కనువిందు చేయనుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం శనివారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఓ వీడియోను పంచుకుంది. అందులో రీతూ పెళ్లికూతురిలా ముస్తాబై కనిపించింది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమా ప్రస్తుతం వైజాగ్‌లో చిత్రీకరణ చేసుకుంటోంది. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: లియోన్ జేమ్స్, ఛాయాగ్రహణం: నిజార్ షఫీ.



# రికార్డు స్థాయిలో విడుదల

ప్రపంచ వ్యాప్తంగా ఆరు భాషల్లో కలిపి 11,500 తెరలపై సినిమా ప్రదర్శితం కానుందని 'పుష్ప2' నిర్మాణ వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకూ భారతీయ సినిమా ఏదీ ఈ స్థాయిలో విడుదల కాలేదని స్పష్టం చేశాయి. అల్లు అర్జున్ కథా నాయకుడిగా, సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. రష్మిక కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'పుష్ప: ది రైజ్'కి కొనసాగింపుగా రూపొందుతున్న ఈ చిత్రం డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. భారత దేశంలో 6,500 తెరలపైనా, ఓవర్సీస్‌లో 5000 తెరలపైనా 'పుష్ప2' విడుదలవుతోందని, ఇదొక రికార్డు అని చిత్రవర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఓటీటీ మార్కెట్‌లో రికార్డు స్థాయి వ్యాపారం చేసుకున్న ఈ చిత్రం, థియేటర్లలోనూ అదే స్థాయిలో సందడి చేసే అవకాశాలున్నాయి. ఫహాద్ ఫాజిల్, సునీల్, అనసూయ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

# ఉపాసన పెద్ద మనసు...

## రేణు దేశాయ్ కి సాయం



మూగ జీవాల సంరక్షణ కోసం సినీ సెలెబ్రెటీలు ఎప్పుడూ ముందుంటారు. ఈ క్రమంలో కొందరు పలు ఎన్.జి.ఓ సంస్థలకి విరాళాలు ఇవ్వడం, అలాగే పెట్ కేర్ సంస్థలు స్థాపించడం వంటివి చేస్తుంటారు. అయితే ఒకప్పటి హీరోయిన్ మరియు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మాజీ భార్య రేణు దేశాయ్ మూగ జీవాల సంరక్షణ కోసం ఇటీవలే శ్రీ ఆద్య యానిమల్ షెల్టర్ అనే సంస్థను ప్రారంభించారు. అయితే ఈ సంస్థకి ఎవరైనా విరాళాలు ఇవ్వచ్చని తెలిపింది.దీంతో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ భార్య ఉపాసన కొణిదెల తమ పెంపుడు కుక్క రైమీ పేరు మీదుగా శ్రీ ఆద్య యానిమల్ షెల్టర్ సంస్థకి పెద్ద మొత్తంలో విరాళం ఇచ్చింది. ఈ విరాళంతో రేణు దేశాయ్ మూగ జీవాల కోసం అత్యవసర పరిస్థితులలో ఉపయోగించడానికి అంబులెన్సు ని కొనగోలు చేసినట్లు తెలిపింది. ఈ విషయాన్ని రేణు దేశాయ్ సోషల్ మీడియా ద్వారా తెలిపింది. దీంతో మెగా ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయం ఇలా ఉండగా పెళ్ళయిన తర్వాత సినిమాలకి పూర్తిగా దూరమైంది నటి రేణు దేశాయ్. విడాకుల తర్వాత పిల్లల భాద్యతలు చక్కబెట్టే పనిలో పడింది. అయితే గత ఏడాది మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన టైగర్ నాగేశ్వర రావు చిత్రంలో ప్రాధాన్యత ఉన్నటువంటి పాత్రలో నటించింది. కానీ ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది.



# అలా నిరూపిస్తే సినిమాలు మానేస్తా

"వెండితెరపై ఇప్పటి వరకు చెప్పని ఒక కొత్త ఎమోషన్‌ను 'క' చిత్రంతో చూపించనున్నాం. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. సినిమా పూర్తయ్యే సమయానికి ప్రేక్షకులు తప్పకుండా ఆశ్చర్యానికి గురవుతారు" అన్నారు కిరణ్ అబ్బవరం. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని సుజిత్ - సందీప్ సంయుక్తంగా తెరకెక్కించారు. నయన సారిక, తన్వీ రామ్ కథానాయికలు. ఈ చిత్రం ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. "వాసుదేవ్ అనే వ్యక్తి కథ ఇది. అతనొక అనాథ. పక్కవారి జీవితాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్న ఉత్సాహం ఎక్కువ. వేరే వాళ్ల ఉత్తరాలు చదువుతూ వాళ్ల ఎమోషన్స్‌ను ఆస్వాదిస్తుంటాడు. పోస్ట్‌మ్యాన్ అయ్యాక కృష్ణగిరి వెళ్తాడు. మరి అక్కడికి వెళ్లాక ఏం జరిగిందన్నది ఆసక్తికరం. ఇదొక భిన్నమైన సస్పెన్స్ థ్రిల్లర్. ఇలాంటి కథ ఇప్పటి వరకు రాలేదు. ఒకవేళ అలా వచ్చిందని నిరూపిస్తే సినిమాలు మానేస్తా. నా వాసుదేవ్ పాత్రలో అన్ని ఎమోషన్స్ ఉంటాయి. ప్రేక్షకులు తప్పకుండా నన్ను కొత్తగా చూస్తారు" అన్నారు. "మల్టీప్లెక్స్‌ల కోసం రాసిన కథ కాదిది. బీ,సీ సెంటర్ల ప్రేక్షకుల్ని దృష్టిలో పెట్టుకుని చేశాం. స్క్రీన్‌ప్లే కొత్తగా ఉంటుంది. ఏమాత్రం గందరగోళం అనిపించదు" అన్నారు దర్శకులు సుజిత్, సందీప్. ఈ కార్యక్రమంలో తన్వీ రామ్, నయన్ సారిక, వంశీ నందిపాటి తదితరులు పాల్గొన్నారు.

